



లక్ష్మీనగర్‌లో పర్యటిస్తున్న సిపిఎం బృందం

జోరుగా వరి నాట్లు

- కెసి కెనాల్ కు నీరు రాకతో రైతుల్లో ఉత్సాహం
- సగం ఆయకట్టుకు పైగా వరి నాట్లు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలంలో వరి నాట్లు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు కెసి కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో కెసి కెనాల్ ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు రైతులు మండలంలోని సుంకేసుల మొదలుకొని కొంతలపాడు ఆర్‌కె దుద్యాల, ఎదురూరు, జి సింగవరం, నిడ్జూరు మునగలపాడు మామిదాలపాడు, వెంకయ్యపల్లె, పడిదంపాడు, పూడూరు వరకు కెసి కెనాల్ ఆయకట్టు కింద వరి రైతులు దుక్కులు చేసి సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే బోర్ నీటి కింద సాగు చేస్తున్న రైతులు ముందస్తుగానే వరి నారు పోసుకున్నారు. ముందస్తుగా వేసిన నారు చేతికందడంతో ఇప్పటికే కొంతమంది రైతులు నాట్లను పూర్తి చేసుకున్నారు. వర్ష ఆధారిత రైతులు గత 15 రోజుల నుంచి వరి నారు పోసుకునేందుకు ఉపక్రమించారు. ఆయకట్టు కింద సుమారు 80శాతం పైగా వరి నారుమళ్లు చేతికందాయి. దాదాపు సగం ఆయకట్టు కింద నాట్లు కూడా పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో అధికారులు రైతులకు వరి సాగుకు సంబంధించి పలు సూచనలు సలహాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.



వరి నాట్లు వేస్తున్న కూలీలు

వరి సాగులో మెలకువలు పాటించాలి

-మండల వ్యవసాయ అధికారి విశ్వనాథం

వరి సాగుకు సంబంధించి పలు సూచనలు సలహాలను కర్నూలు మండల వ్యవసాయ అధికారి ఎస్.విశ్వనాథ్ మాట్లాడుతూ వరి సాగులో రైతులు తగిన పద్ధతులను పాటించాలన్నారు. వరి నాటే ముందు చివరి దుక్కులు నాట్లకు వారం ముందు ఎకరాకు ఒక బస్తా సూపర్, రెండు రోజుల తర్వాత 20 కేజీల జింకు మరో రెండు రోజుల తర్వాత ఒక బస్తా డిఎపి నారుమడిలో చల్లాలన్నారు. ఆపై మూడు రోజుల తర్వాత వరి నాట్లు వేస్తే నారు మొక్కలు బలంగా ఎదిగేందుకు దోహదపడడమే కాకుండా కలుపు తక్కువగా రావడానికి ఆస్కారం ఉంటుందన్నారు. దీని తర్వాత రెండు లేదా మూడు దఫాలుగా ఎకరాకు సగం బస్తా యూరియా సగం బస్తా పొటాషియం వేయాలని అన్నారు. పొలంలో 6 నుంచి 7 వరుసలకు ఖాళీ బాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా మందులు పిచికారి ఎరువులు చల్లేందుకు గాలి బాగా వీచి పురుగు, దోమ ఉధృతి తగ్గడానికి ఆస్కారం ఉంటుందన్నారు. మరిన్ని సూచనల సలహాల కోసం రైతు సేవ కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బందిని రైతులు సంప్రదించి తగిన సూచనలు సలహాలు తీసుకోవాలని కోరారు.

రోడ్లా.. నీటికుంటలా...

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

లక్ష్మీనగర్‌లో సిపిఎం బృందం పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 24వ వార్డులో రోడ్లు నీటి కుంటలుగా మారినా పట్టించుకునే నాథుడే లేడని, మున్సిపల్ అధికారులు నిద్రపోతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ విమర్శించారు. శనివారం కర్నూలు లక్ష్మీ నగర్ లో సిపిఎం నాయకులు వి.వెంకటేశ్వర్లు, శేషాద్రి, ఎల్లగువేరాలతో కలిసి ఆయన వార్డు పర్యటన చేశారు. ఈ సందర్భంగా వార్డులో ఎక్కడ చూసినా మురుగునీరు రోడ్లపై వచ్చి నీటి కుంటలుగా ఉన్నాయని ఎవరు పట్టించుకునే వారు లేరని స్థానిక ప్రజలు సిపిఎం ప్రతినిధి బృందానికి తెలిపారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ లక్ష్మీనగర్, మద్దూర్ నగర్ ఏరియాలు ఒకప్పుడు పరిశుభ్రతకు నిలయంగా ఉండేవని నేడు అపరిశుభ్ర వార్డుగా మారిందన్నారు. చిన్న పాటి వర్షానికి వీధిలోని రోడ్లపై నీరు నిలిచి దోమలకు స్థావరంగా మారి రోజులు గడిచే కొద్దీ దుర్గంధం వెదజల్లి స్కూలుకు వెళ్లే చిన్నారుల నుండి ముదుసలి వరకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. వార్డులో ఎక్కడ చూసినా డ్రెయినేజీ నీరు కాల్వలో నిల్వ ఉంటుందని ఈ వీధిలో వేసిన రోడ్లు డ్రైనేజ్ కాలువలు ఒక పద్ధతిగా లేవని, దీనివల్ల మురుగు నీరు వర్షపు నీరు బయటకి వెళ్లక అక్కడే ఉండి మురుగుకుంటలుగా మారుతున్నాయని చెప్పారు. ఈ విషయంపై స్థానిక ప్రజలు సిపిఎం నాయకులు అనేకసార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం మాత్రం లేదని విమర్శించారు. ప్రజల నుండి ముక్కు పిండి పన్నులు వసూలు చేసే మున్సిపల్ అధికారులకు ప్రజలకు సౌకర్యాలు అందించడంలో మాత్రం లేదని ఆయన ఘాటుగా విమర్శించారు. మున్సిపల్ కమిషనర్ కనీసం ఇలాంటి వాటిలో పర్యటన చేస్తే మంచిదని ఆయన సూచించారు. కొన్నిచోట్ల దుర్వాసనతో మురుగు నీరు రోడ్ల పైన పారుతుందని, ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు డెంగ్యూ, కలరా, మలేరియా వ్యాధులతో ఆసుపత్రుల పాలవుతున్నారని ఇలాంటి సందర్భంలో మున్సిపల్ అధికారులు ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ వార్డు ప్రజలకే కాకుండా గణేష్ నగర్ ప్రజలకు ముఖ్యంగా మహిళలకు ఇబ్బంది కలిగిస్తున్న గ్రీన్ పార్క్ బార్ రెస్టారెంట్ ను తొలగించాలన్నారు. కెనాల్ మెయిన్ రోడ్‌కు వీధి లింక్ రోడ్లు లింక్ చేయాలని, తక్షణమే లక్ష్మీనగర్, మజ్దూర్‌నగర్‌లో మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని రోడ్లు లెవెలింగ్ వేయాలని లేని పక్షంలో నగరంలో ప్రజలు సమస్యలు పరిష్కారానికి ప్రజల్ని సమీకరించి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

'టిడ్కో' మారేనా? : పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. వైసిపి ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు ఇచ్చేందుకు ఆర్భాటంగా కార్యక్రమాలు నిర్వహించింది. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టింది. టిడ్కో ఇళ్లు ఇచ్చినా ఉపయోగం లేని పరిస్థితి నెలకొంది. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. నివాసానికి అనానుకూల వాతావరణం ఉండటంతో లబ్ధిదారులు వాటిలో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. టిడిపి కూటమి ప్రభుత్వంలో టిడ్కో పరిస్థితి మారుతుందా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

అవీ..ఇవీ..అన్నీ..

పాణ్యం మండలం పిన్నాపురం గ్రామంలో గ్రీన్ కో సోలార్ కంపెనీ వల్ల భూములు కోల్పోయి నష్టపోయిన రైతులు, నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం నేతలు ప్రభుత్వాన్ని కోరారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డికి ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, కర్నూలు జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, గ్రీన్ కో భూముల నిర్వాసితుల కన్వీనర్ ప్రసాద్ వినతి పత్రం సమర్పించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో స్వర్ణ గ్రామ పంచాయతీ పేరుతో గ్రామ సభలు నిర్వహించారు. మౌలిక సదుపాయాల్లో నాలుగు అంశాలపై ప్రధానంగా ఫోకస్ పెట్టారు. గ్రామ పంచాయతీలో అవసరమైన వాటిని గుర్తించి తీర్మానాలు చేశారు. వాటికి నిధులు విడుదల చేసి పనులు చేపట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

టమోటా, ఉల్లి కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు

- పరిశ్రమ ప్రోత్సాహకాలు రూ.4.11 కోట్లు
- ప్రోత్సాహక కమిటీలో ఆమోదం

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో టమోటా , ఉల్లి కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ ఆమోదముద్ర వేసింది. పారిశ్రామిక ప్రోత్సాహకాలకు సంబంధించిన 53 క్లెయిమ్స్‌కు సంబంధించి రూ.4,11,87,512 లకు ఆమోదం తెలిపినట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాష పేర్కొన్నారు. పెట్టుబడి రాయితీ కింద 34 క్లెయిమ్స్‌కు సంబంధించి రూ.3,64,61,414 విద్యుత్ ఖర్చు రీయింబర్స్‌మెంట్ క్రింద 12 దరఖాస్తులకు సంబంధించి రూ.17,34,513 వడ్డీ రాయితీ రీయింబర్స్‌మెంట్ క్రింద 07 దరఖాస్తులకు సంబంధించి రూ.29,91,585లు పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఆమోదం తెలపడం జరిగిందన్నారు. శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు , ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమల స్థాపనకు సంబంధించిన దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు వచ్చే దరఖాస్తులను సంబంధిత అన్ని శాఖలతో పాటు భూమికి సంబంధించిన క్లియరెన్స్ కోసం రెవెన్యూ శాఖకు కూడా పంపించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, పరిశ్రమ శాఖ జిఎం మారుతీ ప్రసాద్, ఎపిఐఐసి జిఎం సోమశేఖర్ రెడ్డి, ఐలా ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కోఆర్డినేటర్ దిలీప్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఎసెన్షియాపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

- కలెక్టరేట్ ఎదుట నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎసెన్సియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో కార్మికుల మృతికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎసెన్షియ ఫార్మా కంపెనీ యాజమాన్యాన్ని శిక్షించాలని, కార్మికులకు భద్రత,రక్షణ కల్పించాలని పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సిఐటియు ఓల్డ్ సిటీ అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన జరిగిన ధర్నా పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డిఅంజిబాబు, జిల్లా నాయకులు జె. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫార్మా కంపెనీ యాజమాన్యం భద్రతా చర్యలు చేపట్టడంలో తీవ్రంగా విఫలమైందన్నారు. ఫార్మా కంపెనీలో సంఘటన జరిగి రెండు రోజులు పూర్తవుతున్న ఇప్పటివరకు యాజమాన్యం పైన చర్యలు తీసుకోలేదన్నారు. ముఖ్యమంత్రి మంత్రులు చేస్తున్న ప్రకటనలలో చూస్తుంటే కంపెనీ యాజమాన్యానికి మద్దతు పలికే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఫార్మా కంపెనీలలో నిరంతరం సేఫ్టీ ఆడిట్ జరిగేందుకు లేబర్ ఆఫీసర్లు తనిఖీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు న్యూ సిటీ అధ్యక్షులు నరసింహులు ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ ,బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సుధాకరప్ప ,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మహమూద్ , హుస్సేన్ వలి, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంజిబాబు

నిరసనాగ్రహం..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కలకత్తా వైద్య విద్యార్థినిపై హత్యాచారినికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు చేపట్టిన పోరాటం ఉధృతంగా సాగింది. ఈ పోరాటానికి మద్దతుగా ఐఎంఎ, ఎపి మెడికల్ సేల్స్ అండ్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నిరసనలు తెలియజేశాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆస్పత్రిలో వైద్యులు తమ విధులను బహిష్కరించి పోరాటానికి మద్దతుగా నిలిచారు. కేవలం అత్యవసర కేసులకు మాత్రమే వైద్య సేవలను అందించారు. కర్నూలులో వైద్యులు, వైద్య విద్యార్థులు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్ విహార్ కూడలి నుంచి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వరకు జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపుమేరకు వైద్య సేవలను నిలిపివేసి నిరసనకు సంఘీభావం తెలియజేశారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణంలో నిర్వహించిన నిరసనకు ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా, ప్రజా సంఘాలు సంఘీభావం తెలిపాయి. నంద్యాలలోనూ నిరసన ప్రదర్శన చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు నిర్వహించారు.

తగ్గుతున్న ఆదరణ : డిగ్రీలో చేరే వారి సంఖ్య తగ్గిపోతోంది. ప్రవేశం పొందిన వారిలోనూ ఎక్కువగా బీకాం కంప్యూటర్స్‌లో చేరారు. సాధారణ బిఎ కోర్సుల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో ఉన్న సీట్లలో ఇప్పటి వరకు 40 శాతం కూడా భర్తీ కాలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో దాదాపు 15వేలకు పైగా డిగ్రీ సీట్లు ఉండగా ఇప్పటి వరకు 6,234 మంది విద్యార్థులే ప్రవేశాలు పొందారు. చేరిన వారిలోనూ ఎక్కువగా బీకాం కంప్యూటర్స్‌లోనే చేరారు. బీకాం కంప్యూటర్స్‌లో 2,565 సీట్లు ఉండగా 80 శాతం సీట్లు ఇప్పటికే భర్తీ అయ్యాయి. కర్నూలు నగరంలోని పది ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో 80 శాతం పైగా సీట్లు భర్తీ అయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని పలు కళాశాలల్లో ఆర్ట్స్ గ్రూపుల్లో చేరే వారి సంఖ్య భారీగా తగ్గింది. బిఎ చరిత్ర, ఎకనామిక్స్ కోర్సులకు సంబంధించి ప్రతి ప్రభుత్వ కళాశాలల్లో 40 సీట్ల చొప్పున కేటాయించినా విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపలేదు. నంద్యాల జిల్లాలో 600 సీట్లు, కర్నూలులో 150 సీట్లు ఉండగా 30 శాతం భర్తీ కాలేదు. సైన్సు కోర్సుల్లో కూడా ఈ ఏడాది అనుకున్నంత మేర అడ్మిషన్లు లేవు. సైన్సు కోర్సుల్లో బిఎస్సీ, బిజడ్‌సి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కర్నూలులోని పది ప్రయివేటు కళాశాలల్లో 45 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 15 సీట్లు, రెండు ప్రైవేటు కళాశాలల్లో 50 శాతం సీట్లు నిండాయి. ఇంటర్‌లో సైన్సు చదివిన విద్యార్థులు మెడిసిన్, డెంటల్, అగ్రికల్చర్ బిఎస్సీ, వెటర్నరీ, ఫార్మసీ కోర్సుల వైపు వెళ్తున్నారు. కార్పొరేట్ యుగంలో చిన్నారులను చిన్నప్పటి నుంచి ఇంజనీర్, డాక్టర్ అవ్వాలనే కోరికలతో తల్లిదండ్రులు వారి మీద ఆ ఆలోచనలు రుద్దుతూ వస్తున్నారు. ప్రయివేటు, పాఠశాలల్లోనూ ఐఐటి, జెఇఇ, నీట్ అంటూ ఐదారు తరగతుల నుంచే వారిని బట్టీ చదువులకు బానిసలను చేస్తున్నారు. వీటన్నిటి కారణంగానే డిగ్రీ చదివి సివిల్స్, గ్రూప్స్ వంటి వాటి పైపు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది.



ముగ్గురు సెక్యూరిటీ సిబ్బంది సస్పెన్షన్

జిజిహెచ్ సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో విధులపట్ల నిర్లక్ష్యం వహించిన ముగ్గురు సెక్యూరిటీ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేశామని ఆసుపత్రి సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నందు ఎమర్జెన్సీ విభాగానికి వచ్చే పేషెంట్లపై విధి నిర్వహణలో ఉండే ముగ్గురు సెక్యూరిటీ సిబ్బంది అంబులెన్స్ వచ్చినా కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పై సూపరిన్‌టెన్‌డెంట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిసి కెమెరా ద్వారా పర్యవేక్షణ చేసి బాధ్యులైన సెక్యూరిటీ సిబ్బంది కృపాకర్, శేక్షావలి కుమార్‌లను ఐదు రోజుల పాటు సస్పెన్షన్ చేస్తూ ఎక్స్‌ఫర్ట్ సెక్యూరిటీ ఏజెన్సీకి ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగాలైన ఎఎంసి క్యాజువాలిటీ, గైనిక్ విభాగాలలో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రద్దీగా ఉన్న ప్రదేశాలలో నివారణ చర్యలు తీసుకోవాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. సూపరిండెండెంట్ ఆఫీస్ ద్వారా నిత్యం సిసి కెమెరా నిఘా ఉంటుందని నిత్యం పర్యవేక్షణ చేస్తూనే ఉంటామని వైద్య సిబ్బంది, డాక్టర్లు, నర్సులు, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది ఎవరైనా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే వారిపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. ఆసుపత్రిలో సెక్యూరిటీ సిబ్బందిపై ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్‌ఎంఒ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నగాంజన్, తదితరులు పాల్గొన్నారు.



విధి నిర్వహణలో సెక్యూరిటీ గార్డుల నిర్లక్ష్యాన్ని సిసి కెమెరాలో వీక్షిస్తున్న డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి

ఫిర్యాదులపై అలసత్వం తగదు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరపాలక హెల్ప్‌లైన్ ద్వారా వచ్చే ఫిర్యాదులను సంబంధించిత విభాగాలకు పంపించడంతో అలసత్వం వహించొద్దని నగరపాలక కార్యాలయ మేనేజర్ ఎన్.చిన్నరాముడు సూచించారు. నగరపాలక కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల స్వీకరణ విభాగాన్ని శనివారం మేనేజర్ ఆకస్మిక తనిఖీ చేశారు. గత మూడు నెలలుగా వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. కాగా గడిచిన మూడు నెలల్లో హెల్ప్‌లైన్, వాట్సాప్ ద్వారా మొత్తం 628 సమస్యలు రాగ, వాటిలో 528 సమస్యలు పరిష్కారం అయ్యాయి. ఇందులో ప్రజారోగ్య విభాగానికి సంబంధించి 256 ఫిర్యాదులు రాగ, అందులో 206 సమస్యలు పరిష్కారం అయ్యాయి. మిగిలిన సమస్యల్లో పశువుల బెడదకు సంబంధించినవి అధికంగా ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 352 ఫిర్యాదులు ఫిర్యాదులు అందగా, వాటిలో 311 సమస్యలు పరిష్కారం అయ్యాయి. మిగిలిన వాటిల్లో రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా సంఖ్యలో ఉన్నాయి. వాటి పరిష్కారానికి కూడా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 20 ఫిర్యాదులు రాగా 11 ఫిర్యాదులు పరిష్కారం అయ్యాయి. మిగిలిన ఫిర్యాదుల్లో అధికంగా అక్రమ నిర్మాణాలపై ఉండగా, సంబంధిత అధికారులకు ఇప్పటికే అధికారులు నోటిసులు జారీ చేశారు. మేనేజర్ మాట్లాడుతూ హలో కెఎంసి కార్యక్రమానికి నగరపాలక సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వచ్చిన ప్రతి ఫిర్యాదుకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రజలు నగరపాలక కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా, ఏవైనా ఫిర్యాదులు ఉంటే 7422992299 ఈ నెంబర్‌కి కాల్ లేదా వాట్సాప్ ద్వారా సమస్య తెలుపవచ్చన్నారు. ఇప్పటి వరకు వచ్చిన సమస్యల్లో దాదాపు పరిష్కారం అయ్యాయని, మిగిలిన సమస్యలకు సంబంధించి పరిష్కార చర్యలు వివిధ దశల్లో ఉన్నట్లు మేనేజర్ పేర్కొన్నారు.



అవినీతిపై విచారణ జరపాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

గ్రామంలో అభివృద్ధి పేరుతో నిర్వహించిన పనులలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కర్నూలు టిడిపి మండల కన్వీనర్ బుర్ర వెంకటేశ్ కోరారు. ఆయన ఉల్చాల గ్రామంలో టిడిపి నాయకులతో కలిసి స్పెషల్ ఆఫీసర్ సత్య భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్చాల గ్రామంలో చేయని పనులకు సంబంధించి సుమారు రూ. 39 లక్షల బిల్లులు పెట్టి స్థానిక సర్పంచు, మాజీ వైస్‌ఎంపిపి అవినీతికి పాల్పడ్డారన్నారు. వారితోపాటు వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఎంపిటిసి రాములమ్మ, మాజీ సర్పంచులు ఎంపిటిసిలు భీసన్న, మద్దిలేటి, హనుమంతు, శివన్న, చెన్నయ్య, ప్రభాకర్, చిన్న తిమ్మప్ప, రామ్ పులి, తదితరులు పాల్గొన్నారు.

పంటనమోదు పరిశీలన

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

కోడుమూరు మండలంలోని వెంకటగిరి గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని శనివారం మండల వ్యవసాయ అధికారి పరిశీలించారు. మండలంలో 35,369 ఎకరాలు సాధారణ విస్తీర్ణం ఉండగా ఇప్పటివరకు పంట నమోదు చేసిన విస్తీర్ణం 12,062 ఎకరాలలో పంట నమోదు చేశారు. ఇంకా 23,300 ఎకరాలలో పంట విస్తీర్ణం చేయవలసి ఉన్నదని, మండలంలోని రైతులందరూ రైతు సేవా కేంద్రాలకు వెళ్లి త్వరితగతిన ఈ నెల ఆఖరికు అంతా అందరు పంట నమోదు చేయించుకోవాలని మండలంలోని రైతు సోదరులందరికీ విజ్ఞప్తి చేశారు. లేనియెడల రైతుకు ప్రభుత్వం నుంచి అందాల్సినటువంటి ఇన్సూరెన్స్, మద్దతు ధర, ప్రభుత్వ పథకాలు ఏవి కూడా రైతులకు వర్తించవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారితో పాటు వ్యవసాయ సిబ్బంది కౌలుట్ల, రసూలు ,వెంకటగిరి గ్రామ రైతులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహం తనిఖీ

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని శనివారం స్టానిక తహశీల్దారు చంద్రశేఖర్ వర్మ తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను, వంటగదిని, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతి సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. తాహశీల్దార్ వెంట ఆర్ఐ మస్తానయ్య, హాస్టల్ వార్డెన్ ఉస్మాన్ ఉన్నారు.

ఈ వారంలోనే అందుబాటులోకి ఇసుక : జెసి

ప్రజాశక్తి-సి బెళగల్

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మండలంలో ఈ వారంలోనే ప్రజలకు, నిర్మాణాలకు ఇసుక అందుబాటులోకి వస్తుందని జాయింట్ కలెక్టరు నవ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఈర్లదిన్నె, సింగవరంరీచ్‌లను మైనింగ్ అధికారి రాజశేఖర్, తహసీల్దార్ విజయశ్రీ, ఎంపిడిఒ రాముడు, కోడుమూరు పరిధి సెబ్ అధికారి రామాంజనేయులు సమక్షంలో తనిఖీ చేపట్టారు. ఈ వారంలో 28 లేదా 29న అధికారికంగా చేపట్టెందుకు అధికారులు సమాయత్తం కావాలన్నారు. ఇసుక రీచ్ వద్ద తోడేసిన ఖర్చులతో కల్పి టన్ను రూ.326.50లకు అందిస్తున్నట్లు తెలిపారు. పాలసీ విధానం అనుసరించి ప్రస్తుతం సచివాలయంలో మానువల్‌గా చెల్లించాలని తగు నిబంధనలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఆర్ఐలు, రెవిన్యూ సిబ్బంది తదితరులున్నారు.



సి బెళగల్‌లో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జెసి నవ్య

మెడికల్ క్యాంపులు సంతృప్తినిస్తున్నాయి

సుశీల నేత్రాలయ అధినేత డాక్టర్ సుధాకర్ రావు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ఉమ్మడి జిల్లాలో సుశీల నేత్రాలయ హాస్పిటల్ ఆధ్వర్యంలో కంటి చూపు సరిగా లేని నిరుపేద ప్రజలకు నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులు సంతృప్తినిస్తున్నాయని సుశీల నేత్రాలయ హాస్పటల్ అధినేత సుధాకర్‌రావు తెలిపారు. శనివారం కర్నూలు నగరంలోని బుధవార పేటలో ఉన్న సుశీల నేత్రాలయ హాస్పిటల్లో రోజా వీధికి చెందిన పేద ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తూ రోజా వీధి మీసాల సుమలత డాక్టర్ సుధాకర్ రావును, డాక్టర్ చందును శాలువా కప్పి పూల కుండి అందించారు. మీసాల సుమలత మాట్లాడుతూ సుశీల నేత్రాలయ హాస్పటల్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు, పేద ప్రజలకు ఉచిత కంటివైద్య మెడికల్ క్యాంపులవల్ల కళ్లను కాపాడుకునేందుకు ఇటుకంటి అద్దాలు, అటు కంటి వైద్య పరీక్షలు ఉచితంగా అందించడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది నాగార్జున, మద్దమ్మ, ఆనంద్ , ఆంజనేయులు, నాగన్న, ఖాదర్ ,శంకరమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ సుధాకర్ రావును అభినందిస్తున్న సుమలత, తదితరులు

వైద్యురాలిపై దాడి, హత్య చేసిన నిందితులను శిక్షించాలి

డాక్టర్ కెవిఎస్ ఆర్ ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కరస్పాండెంట్ విజయలక్ష్మమ్మ

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

కోల్‌కతా వైద్యురాలి పై హత్యాచారంను నిరసిస్తూ డాక్టర్ కెవి సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆ కళాశాల కరస్పాండెంట్ ఎస్.విజయ లక్ష్మమ్మ మాట్లాడుతూ కోల్‌కతాలో డాక్టర్ పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళలపై అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన శిక్షలు అమలు చేయాలన్నారు. ప్రతి మహిళకు భద్రత కల్పించాలని కోరారు. ఈ ర్యాలీలో కళాశాల ప్రిన్సిపల్ కె.కన్నాకుమార్ నాక్ కో ఆర్డినేటర్ డాక్టర్ సి. ధనరాజ్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కో ఆర్డినేటర్ కె. గీతావాణి, హెచ్ఒడీస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డాక్టర్ కెవిసుబ్బారెడ్డి కాలేజీలో నిరసన ప్రదర్శన



అధికారులతో మాట్లాడుతున్న జెసి నవ్వ

గుడికంబాలి ఇసుక రీచ్ తనిఖీ

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం మండలం గుడికంబాళిలోని ఇసుక రీచ్‌లోని స్టాక్ యార్డ్‌ను జెసి బి.నవ్య తనిఖీ చేసి పరిశీలించారు. శనివారం గుడికంబాలి ఇసుక రీచ్ వద్ద ఉన్న స్టాక్ వివరాలు, తుంగభద్ర నుంచి లభిస్తున్న ఇసుక వివరాలు అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆదోని ఇన్‌ఛార్జీ సబ్ కలెక్టర్ సి.విశ్వనాథ్, మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, తహశీల్దార్ మల్లికార్జున స్వామి, ఆర్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

గురుకులంలో సైన్స్ గ్రూపులను ప్రవేశపెట్టాలి

- విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - ఆలూరు



మాట్లాడుతున్న డిసిఒ శ్రీదేవి

మండలంలోని అరికెర అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ సైన్సు గ్రూపులను ప్రవేశ పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిసిఒ శ్రీదేవికి వినతిపత్రం అందించారు. శనివారం అరికెర గురుకుల పాఠశాలలో సైన్సు గ్రూపులను ప్రవేశ పెట్టడానికి పేరెంట్స్ కమిటీతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అభిప్రాయం కోరారు. వారు ఆర్ట్స్ గ్రూపుతోపాటు సైన్సు గ్రూపులను ప్రవేశ పెట్టాలని కోరారు. లేకపోతే వచ్చే ఏడాది వరకు ఆర్ట్స్ గ్రూపులను కొనసాగిస్తూ సైన్సు గ్రూపులను కూడా అందించాలని కోరారు. అలాగే పాఠశాల ముందు విరుపాపురం స్టోరేజ్ ట్యాంకు నుంచి పక్క గ్రామాలకు నీరందిస్తున్నారని పైపు లైన్ నుంచి మంచినీటిని పాఠశాలకు అందించాలని బీసీ సంఘం నాయకులు తిక్కస్వామి కోరారు. గురుకులంలో ప్రస్తుతం ఉన్న ఎంఇసి, సిఇసి గ్రూపుల్లో విద్యార్థులు తక్కువగా చేరినందున ఆర్ట్స్ గ్రూప్ స్థానంలో సైన్స్ గ్రూపు అందిస్తామని డిసిఒ తెలిపారు. ఉన్న గ్రూపులను ఎత్తివేయకుండా విద్యార్థులు చేరేలా వచ్చే సమవత్సరం అవగాహన కల్పిస్తామని చెప్పారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని డిసిఒ హామీఇచ్చారు ప్రిన్సిపల్ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు బయోజైమ్ ప్రోత్సాహకాలు

-10 మంది విద్యార్థులకు రూ.25 వేలు పంపిణీ

ప్రజాశక్తి - మంత్రాలయం



ప్రోత్సాహకాలు అందజేస్తున్న సిబ్బంది

మండలంలోని తుంగభద్ర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బయోజైమ్ కంపెనీ వారు ప్రోత్సాహక బహుమతులు అంద జేశారు. శనివారం బహుళజాతి పురుగు మందుల కంపెనీ అయిన బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున అందజేశారు. మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కంపెనీ రీజనల్ మేనేజర్ పి.వరప్రసాద్ రావు, శ్రీభీమా ట్రేడర్స్ అధినేత పిఎల్‌జి.కృష్ణారెడ్డి విద్యార్థులను కోరారు. సీనియర్ ఎఎస్ఎం టి.వేణుగోపాల్ రెడ్డి, సేల్స్ ఆఫీసర్ బి.రఘు, సిబ్బంది వి.రమేష్ కుమార్, ఎం.రవికుమార్, పి.హుస్సేన్, బాలచంద్రుడు, ప్రధానోపాధ్యాయులు ఎ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : టిడిపి

ప్రజాశక్తి - నందవరం



పర్యటిస్తున్న టిడిపి నాయకులు

గ్రామంలో డ్రెయినేజీ కాలువలు నిర్మించి సమస్యలను పరిష్కరించాలని టిడిపి నాయకులు కోరారు. శనివారం మండలంలోని పొనకలదిన్నె గ్రామం 5వ వార్డులో టిడిపి నాయకులు పర్యటించారు. సుంకులమ్మ గుడి పక్కన ఇళ్ల మధ్య వర్షపు నీరు బయటికి వెళ్లడానికి వీలు లేక నిలిచింది. ఈ సందర్భంగా టిడిపి నాయకుల మాట్లాడారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విష జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి 5వ వార్డులో ఉన్న మురుగునీటిని వెంటనే శుభ్రం చేసి, డ్రెయినేజీ, సిసి రోడ్డు ను నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరారు. టిడిపి సీనియర్ నాయకులు శాంతమ్మ, వెంకటరాముడు, నరసింహలు, లక్ష్మికాంత్, శ్రీరాములు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధి ఎంతో అవసరం

- కర్నూలు పార్లమెంటులో జాతీయ రహదారి లేకపోవడం అభివృద్ధికి ఆటంకం

- వేదవతి, ఆర్‌డిఎస్ గుండ్రేవులతోనే జిల్లా సస్యశ్యామలం - కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఇరిగేషన్‌తో పాటు పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. శనివారం గోనెగండ్లలోని గాజులదిన్నె ప్రాజెక్టును సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో పురోగతిని ప్రాజెక్టు ఇఇ శైలేశ్వర్, డిఇ విజయ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అధికారులు తుంగభద్ర ప్రాజెక్టు ఘటనను గుణపాఠంగా తీసుకుని ఎలాంటి ఇబ్బందులూ లేకుండా గాజులదిన్నె ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అక్కడి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడారు. కర్నూలు పార్లమెంటు పరిధిలో ఒక్క జాతీయ రహదారి కూడా లేదని, పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ముందుకు రాకపోవడంతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం లేదని తెలిపారు. కోడుమూరు నుంచి బళ్లారికి హైవే ఏర్పాటు చేస్తే ఐదు నియోజకవర్గాలకు కేంద్ర బిందువుగా మారి పారిశ్రామికంగా అభివృద్ధి చెందవచ్చని చెప్పారు. పార్లమెంట్ పరిధిలో తాగు, సాగునీటికి ఉన్న ఏకైక నీటి వనరు గాజులదిన్నె ప్రాజెక్టు అని తెలిపారు. జనాభా పెరుగుదలతో ఇది కూడా కేవలం తాగునీటి రిజర్వాయర్‌గా మారిందన్నారు. వేదవతి, ఆర్‌డిఎస్ కుడి కాలువ, గుండ్రేవుల రిజర్వాయర్‌ను ఈ ఐదేళ్లలో పూర్తి చేసుకుంటే కర్నూలు పార్లమెంటు సస్యశ్యామలమవుతుందని తెలిపారు. కరువు, వలసలను నివారించి, కోస్తాతో పోటీ పడవచ్చని చెప్పారు. తమకు తెలంగాణ ముఖ్యమంత్రి సహకారం, కూటమి ప్రభుత్వంతో కేంద్రంలోని బిజెపితో ఉండడం వల్ల కర్నూలు పార్లమెంటు అభివృద్ధికి ఇదే సరైన సమయమని తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి ఈ ప్రాంత పర్యటనకు ఆహ్వానించి, ప్రాజెక్టుల ఆవశ్యకతను వివరిస్తామని చెప్పారు. వీలైనంత త్వరగా ప్రాజెక్టుల నిర్మాణాలను ప్రారంభించేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణాలకు భూసేకరణ కీలకమైందని, ఆయా ప్రాంతాల్లోని రైతులందరూ భూ సేకరణకు సహకరించాలని కోరారు. తాము కూడా కలెక్టర్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయమైన పరిహారం వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. గాజులదిన్నె హనుమంతు, రామకృష్ణ, పిల్లిగుండ్ల నాగన్న, జయరాముడు, సంజన్న, చంద్ర పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయంలో తనిఖీ

ఎమ్మిగనూరు : మండలంలోని బనవాసి శివారు ప్రాంతంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాన్ని శనివారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లో ఉన్న విద్యార్థుల దగ్గరకు వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశీలించారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ కె.చందిరన్, సిబ్బంది నవోదయ విద్యాలయం సమస్యలపై ఎంపీకి వినతిపత్రం అందజేశారు. తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయాలని, సోలార్ వేడి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వివరించారు. ఎకె.బసవరాజు, కె.శిరీష, హరీష్ కుమార్, జగన్నాథ్, పద్మ జనార్సీ, ఎం.శ్రీనివాసరావు, మాలి, శ్రీలక్ష్మీ, ఎర్రస్వామి, ఎ.శివాజీరావు, ఎం.వెంకటేష్, సత్యనారాయణ, నీలవేణి, అంజలి, పద్మావతి, లైబ్రేరియన్ యోగేష్, చాంద్, సంజయ్, కృష్ణ, రఫీక్, రామదాసు, నబి, భాస్కర్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను సందర్శించిన ఎంపీ

ఆదోని : కూటమి ప్రభుత్వం తరపున నియోజకవర్గంలోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. మండలంలోని నాగలాపురం దగ్గర ఉన్న గవర్నమెంట్ మెడికల్ కళాశాలను ఎంపీ పంచలింగాల నాగరాజు సందర్శించారు. డీఎస్పీ సోమన్న, తహశీల్దార్ శివ రాముడు, ఆదోని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, ఆర్ఎంఒ డాక్టర్ జగదీష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాలలోని నెలకొన్న సమస్యలను పరిష్కరించి త్వరలోనే తరగతులు ప్రారంభయ్యేలా చూస్తామన్నారు. జిల్లాలో పశ్చిమ ప్రాంతమైన ఆదోనిని ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అవసరమైతే కేంద్రంతో మాట్లాడి ఆదోని ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. టిడిపి బీసీ సాధికారత రాష్ట్ర కమిటీ డైరెక్టర్ చాగి మల్లికార్జున రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, శివప్ప, మాజీ సర్పంచి ఆనవాళ్ల మహబూబ్ బాషా, మాజీ కౌన్సిలర్ వెంకన్నపేట మల్లికార్జున, ఆరెకల్ మాజీ సర్పంచి ఎల్ఐసి రామకృష్ణ, లక్ష్మన్న, విరుపాక్షి రెడ్డి, మదిరే రంగస్వామి, ఢణాపురం రాఘవేంద్ర, పెట్టకండి వీరారెడ్డి యాదవ్, మదిరే రంగస్వామి, శుక్రవారం పేట శివ, జాలమంచి నాగరాజు, షబ్బీర్, దాదు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు అప్సర బాష, శేఖర్, సాంబగళ్ల రమేష్, రంగన్న, మహానంది రెడ్డి, లక్ష్మన్న, రాము, పరమేష్, బాష పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పనులు పూర్తిచేయాలి

మెడికల్ కళాశాల పనులను వెంటనే పూర్తి చేసి మెడికల్ కళాశాలను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంపీకి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలోనే తరగతులు ప్రారంభిస్తామని అధికారులు ప్రకటించారని, ఇంతవరకు పనులు పూర్తి కాలేదని పేర్కొన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేయించి తరగతులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. నాయకులు సూరి, శశిధర్, యశ్వంత్, ప్రతాప్ పాల్గొన్నారు.



గోనెగండ్లలో ప్రాజెక్టు అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ



ఎమ్మిగనూరు నవోదయ విద్యాలయాన్ని సందర్శిస్తున్న ఎంపీ



ఆదోని మెడికల్ కళాశాలను పరిశీలిస్తున్న ఎంపీ

పంట నమోదు వేగవంతం చేయాలి

- ఆదోని ఎడిఎ అరుణ కుమారి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలో ఈ-పంట నమోదును వేగవంతం చేయాలని ఆదోని ఎడిఎ కె.అరుణ కుమారి వ్యవసాయ సహాయకులకు సూచించారు. శనివారం ఎఒ ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో పెద్దకడబూరులో ఈ-పంట నమోదును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సెప్టెంబర్ 15 నాటికి పంట నమోదు, రైతులతో ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. అనంతరం హనుమాపురం గ్రామంలో రైతు సేవా కేంద్ర సిబ్బందితో పంట నమోదు, పంట కోత ప్రయోగాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఒ డి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. పంటకోత ప్రయోగాలపై వ్యవసాయ సహాయకులు జాగ్రత్త వహించాలని తెలిపారు. పంటకోత ప్రయోగానికై ఎన్నికైన పొలాలను సందర్శించి ఫారం-1 సమర్పించాలని చెప్పారు. అలాగే పంట కోత సమయంలో జాగ్రత్త వహించి ప్రయోగాన్ని నిర్వహిస్తేనే గ్రామ పంట దిగుబడి, మండల పంట దిగుబడి, తద్వారా జిల్లా, రాష్ట్ర దిగుబడి అంచనా వేయవచ్చని తెలిపారు. ఎడిఎ అరుణ కుమారి మాట్లాడుతూ... ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల ఇప్పటిదాకా విత్తనం వేయని రైతులకు కొర్ర, జొన్న, సజ్జ విత్తనాలు 80 శాతం సబ్సిడీతో అందజేస్తున్నట్లు వెల్లడించారు.



పంట నమోదును పర్యవేక్షిస్తున్న ఎడిఎ

తెగిన వంతెనను పూర్తి చేస్తాం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - హాలహర్వి

వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడకుండా తాత్కాలిక వంతెన చేపడతామని, అలాగే త్వరగా వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ రామలక్ష్మి అధికారులను ఆదేశించారు. మండలంలోని చింతకుంట నుంచి బళ్లారి వెళ్లే మార్గంలో జాతీయ రహదారిపై ఉన్న తాత్కాలిక వంతెన గత నాలుగు రోజులుగా కురిసిన వర్షానికి తెగింది. శనివారం వంతెనను పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి పరిశీలించారు. తహశీల్దార్ నజీమ భాను, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మి, విఆర్ఒ లింగప్ప, పాల్గొన్నారు.



వంతెనను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రామలక్ష్మి

జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ వేడుకలు

ప్రజాశక్తి - హోళగుంద



హోళగుంద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ శంకర్ ప్రసాద్, మాజీ ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ డేవిడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు ఆటల పాటలతో అందరికీ ఆకట్టుకున్నారు.



ఆలయంలో ఉన్న రాఘవేంద్ర రెడ్డి

ఉరుకుంద సన్నిధిలో రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామిని టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, సతీమణి యశోదమ్మ, ఎన్.రామకృష్ణా రెడ్డి, సతీమణి భారతమ్మ, తనయులు ఎన్.రాకేష్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శనివారం వారికి ఉలిగయ్య, తెలుగు యువత నాయకులు సతీష్ నాయుడు, సురేష్ నాయుడు, టిడిపి ఉరుకుంద గ్రామ నాయకులు, కార్యకర్తలు, ఆలయ పూజారులు ఘన స్వాగతం పలికారు. టిడిపి నాయకులు మహాదేవ, కురుగోడు, చిరంజీవి, పొట్లయ్య, నరసన్న, ఈరన్న పాల్గొన్నారు.

సిఐని కలిసిన మాధవ రావు దేశాయ్



ప్రజాశక్తి - నందవరం

మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయ్ ఎమ్మిగనూరు రూరల్ సిఐ విక్రమ్ సింహను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మాధవరావు దేశాయ్ సిఐకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

క్విజ్ పోటీల్లో 'ఎఫ్ఆర్' ఫస్ట్ ర్యాంక్

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ రెయిన్‌బో స్కూల్‌లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఎఫ్ఆర్ హై స్కూల్ విద్యార్థిని ఎస్.ఆయేషా మండల ఫస్ట్ ర్యాంకు సాధించినట్లు కరస్పాండెంట్ పి.రఘునాథ్ తెలిపారు. ఆర్ఎం రాజేశ్వరి ట్రస్ట్ వారు నిర్వహించిన ఈ క్విజ్ పోటీల్లో స్థానికంగా ఉన్న ప్రయివేట్, ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ట్రస్ట్ ప్రతినిధి జిఎం.రెడ్డి, వైసిపి నాయకులు ప్రభాకర్ రెడ్డి, రెయిన్‌బో స్కూల్ కరస్పాండెంట్ అల్లీపీరా శనివారం ప్రశంసాపత్రాలు అందించారు. తమ విద్యార్థిని క్విజ్ పోటీల్లో పాల్గొని గెలుపొందినందుకు ప్రధానోపాధ్యాయులు ఉచ్చీరప్ప అభినందనలు తెలిపారు.



ప్రశంసాపత్రం అందిస్తున్న నిర్వాహకులు

'పిఎం సూర్య ఘర్'ను సద్వినియోగం చేసుకోండి : ఎఇ

ప్రజాశక్తి - మంత్రాలయం

కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'పిఎం సూర్య ఘర్'ను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎఇ గోవిందు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోలార్ ద్వారా వినియోగదారులకు విద్యుత్‌ను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రాయితీ కల్పిస్తామని తెలిపారు. ఒక కిలో వాట్‌కు సుమారు రూ.60 వేలు ఖర్చు అవుతుందని, అందులో రూ.30 వేల రాయితీ ఉంటుందని చెప్పారు. రెండు కిలో వాట్లకు రూ.60 వేలు, మూడు కిలో వాట్లకు రూ.78 వేలు సబ్సిడీ ఉంటుందని తెలిపారు. అందుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. వాయిదా పద్ధతిలో రుణాలు చెల్లించుకోవచ్చన్నారు. సొంత ఇల్లు ఉన్న వారు రూ.150 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న వారిని సౌర విద్యుత్ కంపెనీ వారు కలిసి పిఎం సూర్య ఘర్ గురించి వివరిస్తారని, ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా రాఘవేంద్రుని రథోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని తుంగభద్ర గ్రామంలోని శ్రీమఠం బ్రాంచిలో రాఘవేంద్రస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మృత్తిక బృందావనానికి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయలును కొయ్య రథంలో ఉంచి పీఠాధిపతులు మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామ పురవీదుల్లో ఘనంగా ఊరేగించారు. అంతకుముందు వసంతోత్సవంతో మంగళ హారతులు ఇచ్చారు.



పూజలు చేస్తున్న పీఠాధిపతులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలోని నారాయణ ప్రైమ్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు నరేష్ ఆచారి ఆధ్వర్యంలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. పాఠశాలలో నృత్యం, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ దీప్తి, ఉపాధ్యాయులు సతీష్ కుమార్, లావణ్య, చంద్రకళ, అంజినమ్మ, సౌమ్య, సమీరా, సంధ్య, పద్మావతి, నారాయణ పాల్గొన్నారు. **కౌతాళం**లోని ప్రతిభ హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధా, రుక్మిణి, సత్యభామ, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. చిన్నారుల చేసిన నృత్యాలు, అల్లరి పనులు గోపికలను ఆటపట్టించే దృశ్యాలు తల్లిదండ్రులను ఆకట్టుకునేలా చేశారు. అనంతరం గోపికల మధ్య కృష్ణుడు ఉట్టి కొట్టడం ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్ మాట్లాడుతూ... పాఠశాలలో విద్యతోపాటు చిన్నారులకు సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, జయలక్ష్మి, భీమేష్, ఖాజా పీర్, ఈరన్న, రాజు, విరుపాక్షి, ముంతాజ్, శిరీష పాల్గొన్నారు.



ఆస్పరి నారాయణ ప్రైమ్ స్కూల్‌లో...



కౌతాళం ప్రతిభ హైస్కూల్‌లో...



సామగ్రిని అందజేస్తున్న నాయకులు

ప్రోత్సాహకాలను వినియోగించుకోండి

- అవోపా పట్టణ అధ్యక్షులు శ్రీనాథ్ గుప్త

ప్రజాశక్తి - ఆదోని

దాతలు, ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అవోపా ఆదోని పట్టణ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్త కోరారు. శనివారం ఆదోనిలోని వాసవీ కల్యాణ మండపంలో అవోపా సంస్థాపకులు కెఆర్.కృష్ణయ్య వర్ధంతి సందర్భంగా అవోపా జిల్లా అధ్యక్షులు ఆత్మకూరు సుబ్రమణ్యం సౌజన్యంతో 40 మంది నిరుపేద విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజ సేవకులు పేద విద్యార్థులను ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యదర్శులు డైమండ్ రఘు, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు పి.రఘు, రాజేష్, అవోపా మహిళ విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, గీత పాల్గొన్నారు.

కుంటనహాలు కార్యదర్శి సస్పెన్షన్

ప్రజాశక్తి - కౌతాళం


మండలంలోని కుంటనహాల్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేష్‌ను సస్పెన్షన్ చేసినట్లు కలెక్టర్ రంజిత్ బాష ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం మెయిల్ ద్వారా ఎంపిడిఒ కార్యాలయానికి సస్పెన్షన్ ఆర్డర్ జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగేష్‌పై గతంలో సర్పంచి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై డిఎల్‌పిఒ నూర్జహాన్ ఈనెల 3న గ్రామంలో విచారణ చేసి నివేదికను అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా సస్పెన్షన్‌కు గురైనట్లు ఉత్తర్వులు వచ్చాయి.

అనారోగ్యంతోనే విఒఎ మృతి

- ఎన్‌డిఎ కూటమిపై బురద చల్లడం తగదు

- టిడిపి పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి రాందాస్ గౌడ్

ప్రజాశక్తి - దేవనకొండ



మండలంలోని గుండ్లకొండ గ్రామ పొదుపు సంఘాల విఒఎ (విలేజ్ బుక్ కీపర్)గా పనిచేస్తున్న రంగస్వామి గౌడ్ అనారోగ్యంతో మృతి చెందారని టిడిపి పార్లమెంటరీ కార్య నిర్వాహక కార్యదర్శి రాందాస్ గౌడ్ తెలిపారు. రంగస్వామి గౌడ్ కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి గ్రామంలోని ఎన్‌డిఎ కూటమి నాయకులు ఉద్యోగం నుంచి తొలగించారని, ఒత్తిళ్లకు గురి చేసినందుకే మృతి చెందారని ఆరోపించడం తగదని అన్నారు. శనివారం దేవనకొండలోని టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కొంతమంది విలేజ్ బుక్ కీపర్లు వాస్తవాలను తెలుసుకోకుండా మృతుడు రంగస్వామి గౌడ్ టిడిపి నాయకుల ఒత్తిళ్లతో మృతి చెందారని ప్రచారం చేశారని తెలిపారు. స్వలాభం కోసం శవ రాజకీయాలు చేయడం సరి కాదన్నారు. కుటుంబ సభ్యులతో వాస్తవాలను తెలుసుకోకుండా ఎన్‌డిఎ కూటమిపై నిందలు మోపడం సబబు కాదన్నారు. మృతుని సోదరుడు సోమశేఖర్ గౌడ్‌ను విలేకరుల ప్రశ్నించగా తన సోదరుడు రంగస్వామి అనారోగ్యంతోనే మృతి చెందాడని, దీనిని రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదని తెలిపారు.

నా ఆరోపణలు వాస్తవం

- బుట్టా రేణుక నాకు రూ.10 లక్షలు ఇచ్చినట్టు నిరూపిస్తారా..?

- మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



'నేను చేసిన ఆరోపణలు వాస్తవం' టిడిపి మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మిగనూరు ప్రాంతంలో ఇసుక, మట్టి, గరుసు అక్రమ తవ్వకాలు, రవాణా జరుగుతోందని తెలిపారు. స్పందించిన అధికారులు వెంటనే గరుసు తవ్వకాలను నిలిపివేశారని చెప్పారు. నాగేశ్వర రెడ్డి అనుచరులు తనపై అనేక విమర్శలు చేస్తున్నారని తెలిపారు. మాజీ ఎంపీ బుట్టా రేణుక తనకు రూ.10 లక్షలు ఇచ్చిందని ప్రచారం చేస్తున్నారని, తనపై వైసిపి ముద్ర వేయాలని ప్రయత్నిస్తున్నారు విమర్శించారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో అవినీతి విషయాలు, రూ.కోట్ల విలువ చేసే భూ ఆక్రమణలు బయటపెట్టానని తెలిపారు. ఎన్నో ప్రయివేట్ ఆస్తుల విషయంలో పేదలకు అండగా నిలిచినట్లు చెప్పారు. వీటిలో రాజీపడి ఉంటే తనకు రూ.కోట్లలో డబ్బు వచ్చేదని, అలాంటిది కేవలం రూ.10 లక్షలకు ఆశపడ్డానంటే ఎవరూ నమ్మేది కాదని తెలిపారు. అవినీతి, అక్రమాలపై తాను చేస్తున్న పోరాటాన్ని తట్టుకోలేక ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. తన నిజాయితీ రాజకీయంతో బీవీ.మోహన్ రెడ్డి, నాగేశ్వర రెడ్డి లబ్ధి పొందారని తెలిపారు. మోహన్ రెడ్డి ఓటమి సమయంలో రాజకీయంగా అండగా నిలిచిన తనకు అప్పుడు. కూడా టిడిపి సభ్యత్వం లేదని, నాగేశ్వర్ రెడ్డితో రాజకీయంగా తాను విడిపోయినా మరో పార్టీలోకి చేరలేదని చెప్పారు. తాను టిడిపికి ఎప్పుడూ ద్రోహం చేయలేదని, అలాగే పార్టీ తనకు ద్రోహం చేయలేదని తెలిపారు. తాను నాగేశ్వర రెడ్డికి వ్యతిరేకంగా పని చేస్తున్నది ప్రజలందరికీ తెలుసని, చంద్రబాబు పాలనలో అవినీతి, అక్రమాలను అడ్డుకోవాల్సింది పోయి తనను అడ్డుకోవడం, విమర్శలు చేయడం సరికాదని చెప్పారు. చేతనైతే గతంలో వైసిపి నాయకులు చేసిన అక్రమాలపై స్పందించాలని, వైసిపి నాయకులు మున్సిపల్ స్థలాలను దొంగ రిజిస్ట్రేషన్లతో ఆక్రమించుకున్నారని తెలిపారు. వీటిపై ఎమ్మెల్యే నాగేశ్వర రెడ్డి స్పందించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇంతవరకు ఆయన నుంచి ఎలాంటి స్పందనా లేదన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణానికి చెందిన 20వ వార్డు టిడిపి కౌన్సిలర్ షేక్ హుస్సేన్ భాష తండ్రి, సీనియర్ నాయకులు, ముస్లిం మైనారిటీ సీనియర్ నాయకుడు కోత మిషన్ షరీఫ్ (75) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అక్కడికి చేరుకొని షరీఫ్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కౌన్సిలర్ హుస్సేన్ బాషను ఓదార్చి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. షరీఫ్ మరణం టిడిపికి తీరని లోటన్నారు. టిడిపి, భూమా కుటుంబం షరీఫ్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు.

ట్రిపుల్ ఐటికి మోడల్ విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థిని పి.జశ్విత 10వ తరగతిలో 576 మార్కులు సాధించి ఐఐఐటికి ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత సంవత్సరం విద్యార్థిని తులసి ఒంగోలు ట్రిపుల్ ఐటిలో, ప్రస్తుత సంవత్సరం జశ్విత కడప ఇడుపులపాయలో సీట్లు సాధించారని తెలిపారు. ట్రిపుల్ ఐటీ సాధించిన విద్యార్థినిని ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఉపాధ్యాయ బృందం

డోన్ డిఎస్‌పిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె సిఐగా పని చేసి ప్రమోషన్‌పై డోన్ డిఎస్పిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులును శనివారం సర్కిల్ కార్యాలయంలో ఆల్ ఇండియా బంజారా సేవాసంఘ్ జిల్లా అధ్యక్షులు హెచ్.కృష్ణా నాయక్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసులు మాట్లాడుతూ గిరిజనులు ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.దేవ నాయక్, డి.గోవిందు నాయక్, చిన్న రాజుపాలెం రామాంజనేయులు, పి.నరసింహులు పాల్గొన్నారు.



డిఎస్పి శ్రీనివాసులకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న ఆల్ ఇండియా బంజారా సేవాసంఘ్ నాయకులు

అన్యాక్రాంత భూమిని స్వాధీనం చేసుకున్న అధికారులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణం ఎస్‌బిఐ కాలనీలో ఉన్న మహానంది దేవస్థానానికి చెందిన ఇనాం భూమిని ఆక్రమణదారుల నుండి దేటదాయశాఖ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. దేవదాయ ట్రిబ్యునల్ కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఆక్రమణకు గురైన కొన్ని ప్లాట్లలో రెండు ఫ్లాట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్లాట్‌లలో ఉన్న కట్టడాలను పోలీస్, రెవెన్యూ అధికారుల సహకారంతో జెసిబిల ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా శ్రీ మహానందీశ్వర దేవస్థానం కార్యనిర్వాహక అధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి మీడియాతో



మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని ఎస్‌బిఐ కాలనీలో మహానందీశ్వర స్వామి దేవస్థానంకు సంబంధించిన భూమి సర్వే 2247లో 3 ఎకరాల 78 సెంట్లు గాను 2 ఎకరాల 8 సెంట్లు భూమిని కొందరు ఆక్రమించుకొని ప్లాట్లు వేసి విక్రయించుకున్నారని చెప్పారు. దీనిపై అప్పట్లో ఆ భూమి ఆక్రమణదారుల నుండి దేవస్థానం స్వాధీన పరుచుకొనేందుకు ఎండోమెంట్ ట్రిబ్యునల్‌లో ఆక్రమణ దారులైన 27 మందిపై కేసులు వేయగా ప్రస్తుతం ముగ్గురి నుండి 3 ప్లాట్లు స్వాధీనం చేసుకొనుటకు ఎండోమెంట్ ట్రిబ్యునల్ కోర్టు దేవాదాయ శాఖకు అనుకూలమైన తీర్పు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

పాఠశాలల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి : ఎంఇఒలు

ప్రజాశక్తి - రుద్రవరం

పాఠశాలల నిర్వహణను ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ మెంబర్లు సక్రమంగా నిర్వర్తించాలని ఎంఇఒలు శివ కోటయ్య, లక్ష్మిలు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో దూరవిద్య విధానం, పాఠశాలల నిర్వహణపై హెచ్‌ఎంలకు, పాఠశాల కమిటీ సభ్యులకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఎంఇఒలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక విద్య విధానంపై పాటించాల్సిన అంశాలపై హెచ్‌ఎంలకు సూచించామన్నారు. 10వ తరగతి, ఇంటర్ దూరవిద్య చదవాలనుకున్న



విద్యార్థులు డిస్టెన్స్ పరీక్షలు రాసేందుకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. పాఠశాలలో టాయిలెట్ల నిర్వహణపై ప్రతి వారంలో బుధవారం, శుక్రవారం పాఠశాల కమిటీ మెంబర్లు, సోమవారం గురువారం వెల్ఫేర్ అసిస్టెంట్లు ఫొటోలు తీసి యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని, మౌలిక వసతులు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఈవోపీఆర్డి శ్రీనివాస శర్మ, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పాఠశాల కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి : ఎంపిపి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

గ్రామాల అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలని ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో మండల సర్వ సభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన, ఎంపీడీవో మహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామాలలో ఏమైనా సమస్యలుంటే



సమావేశం దృష్టికి తీసుకురావాలన్నారు. తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి రెవిన్యూ అంశాల గురించి వివరించారు. అనంతరం ఉపాధి హామీ పథకం, విద్య, పంచాయతీరాజ్, తాగునీరు, వ్యవసాయం అంశాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు వివరించారు. సమావేశంలో ఈఓఆర్డి తాహేర్ హుస్సేన్ , మండల ఉపాధ్యక్షులు నాసారి ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ కమాల్ భాష, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రామకృష్ణనాయక్, ఏపీఓ గణేష్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - రుద్రవరం

ఈనెల 26వ తేదీ సోమవారం ఇస్కాన్ అహోబిలం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు హరి నగరం గ్రామం దగ్గర నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ అహోబిలం ప్రాజెక్ట్ ఇంచార్జ్ చంద్రకేశవ దాస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా ఈనెల 26వ తేదీ సాయంత్రం 4 గంటల అన్ని గ్రామాల నుంచి వచ్చిన యువకులకు గ్రూపుల వారీగా ఉట్లో ఉత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. 6 గంటలకు హారతి భజన కార్యక్రమం ఉంటుందన్నారు. 6. 30 నిమిషాలకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేతుల మీదుగా బహుమతుల ప్రధనోత్సవము ,మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి చేశ్రీకృష్ణ జన్మాష్టమి సందేశము ఉంటుందన్నారు.8 గంటలకు కూచిపూడి కళానిధి డాక్టర్ వేదాంత రామలింగ శాస్త్రి చే నర్తనశాల నృత్య నాటక ప్రదర్శన కార్యక్రమం ఉంటుందన్నారు. 11 గంటలకు శ్రీకృష్ణ అవతారణంలో ప్రత్యేక బాణాసంచా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమన్నారు. రాధా గోవిందులకు మహా శంఖాభిషేక కార్యక్రమం ఉంటుందన్నారు. 11:30 నుంచి 12 గంటలకు భోజన ప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు. 27వ తేదీన ఇస్కాన్ వ్యవస్థాపక ఆచార్య కృష్ణ కృప మూర్తి (ఏపీ) భక్తి వేదాంత స్వామి శ్రీల ప్రభు పాద జన్మదిన వేడుకలు, అభిషేకం వ్యాస పూజ మరియు ప్రవచనములు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.







అవగాహన ర్యాలీలో పాల్గొన్న డిఎంహెచ్‌ఓ

నేటి నుండి జాతీయ నేత్రదాన వారోత్సవాలు

- డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఆర్ వెంకటరమణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నేటి నుండి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ తెలిపారు. శనివారం నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. ఆర్. వెంకటరమణ ఆధ్వర్యములో జాతీయ నేత్రదాన వారోత్సవాలు ఆగస్టు నెల 25 వ నుండి సెప్టంబర్ 8 వ తేదీ వరకు జరిగే అవగాహన కార్యక్రమాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం నుండి పట్టణంలోని టెక్కే వరకు చేపట్టారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఆర్.వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో పట్టణ ఆరోగ్య కేంద్రాలలో పని చేయుచున్న సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తల ద్వారా జాతీయ అందత్వ నివారణ దృష్టి లోప నివారణ కార్యక్రమము మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. కార్యక్రమములో జిల్లా అంధత్వ నివారణ అధికారి డా. మాధవి లత, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి - రుద్రవరం : ప్రభుత్వ పాఠశాలలో వెల్ఫేర్ అసిస్టెంట్లు మరుగుదొడ్ల చిత్రాలను తీయాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని మండలంలోని వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలలో మరుగుదొడ్ల చిత్రాలు అప్లోడ్ చేసే విధానాన్ని తమకు అప్పగించడం న్యాయం కాదని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మెమోను వెనక్కి తీసుకునేలా అధికారులు చొరవ చూపాలని తహసిల్దార్ మల్లికార్జునరావుకు మండలంలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు ఝాన్సీ రాణి వినోద్ ఫ్రేమ్ జాషువా శశిరేఖ ఆంజనేయులు రుక్సానా బేగం తో పాటు పలువురు వెల్ఫేర్ అసిస్టెంట్లు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మాత్రమే మరుగుదొడ్ల చిత్రాలను హెచ్‌ఎం లాగిన్ లో అప్లోడ్ చేసేవారని ప్రస్తుతం ప్రభుత్వం ఆ విధానాన్ని వెల్ఫేర్ అసిస్టెంట్లకు అప్పగిస్తూ వారంలో సోమవారం గురువారం చేయాలని మెమో ఉత్తర్వులు జారీ చేయడం సరైనది కాదని తెలిపారు. ప్రభుత్వం తన సమస్యలను గుర్తించి మరుగుదొడ్ల చిత్రాలు తీసే అంశాన్ని పాత పద్ధతినే కొనసాగిస్తూ ఉపాధ్యాయులకే అప్పగించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో దస్తగిరి నాయక్ మస్తాన్వలి పార్థసారధి రెడ్డి శివప్రసాద్ పాల్గొన్నారు.

26న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' రద్దు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ఈనెల 26న శ్రీ కృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు కావడంతో రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వ్యయ ప్రయాసల కోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 2న నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానం

ప్రజాశక్తి - బేతంచర : ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 27వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని బేతంచెర్ల ఎంఇఒ సోమశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు స్థానిక జడ్పీ హైస్కూల్ కేంద్రంగా ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్, జన్మదిన సర్టిఫికెట్ తీసుకొచ్చి జడ్పీ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులకు అందజేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉత్పత్తి పెంచేందుకే తయారీ కేంద్రం ఏర్పాటు


ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

తెలుగు రాష్ట్రాల వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఉండేందుకే పిడిలైట్ రాఫ్ నూతన తయారీ కేంద్రాన్ని జడ్చర్లలో ప్రారంభించారని పిడి లైట్ రాఫ్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ పూరి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పిడిలైట్ పరిశ్రమ నుండి పేరెన్నిక గల టైల్స్ ఎడ్హెసివ్ ఉత్పత్తి మరింత పెరుగ నుందని స్పష్టం చేశారు. తద్వారా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఈశాన్య కర్ణాటక మార్కెట్లో అత్యంత నాణ్యత ప్రమాణాలు కలిగిన టైల్ ఎడ్హెసివ్ ఉత్పత్తుల డిమాండు తీర్చేందుకు ఎంతగానో దోహద పడుతుందని తెలిపారు. వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా ప్రీమియం ఉత్ప త్తులకు ఉన్న డిమాండ్‌ను తాము అందిపుచ్చుకోనున్నామని భరత్ పూరి ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టుగా ఈ తయారీ కేంద్రం.. పిడిలైట్ దీర్ఘకాలిక వృద్ధి వ్యూహానికి అనుగుణంగా భవి ష్యత్తు విస్తరణకు విస్తృత అవ కాశాలు అందిస్తుందని భరత్ పూరి స్పష్టం చేశారు. పర్యావరణ లక్ష్యాలకు అనుగుణంగా 80 శాతం సౌరశక్తితో నడుస్తుందని, నిర్మాణ రసాయనాల రంగంలో పర్యావరణ అనుకూల తయారీకి కొత్త ప్రమాణాలను ఏర్పరుస్తుందని భరత్ పూరి వెల్లడించారు.

సైడ్ కాలవలు వేయాలని వినతి

ప్రజాశక్తి-మద్దికేర

మురుగునీరు కాలువలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు నంది జయరాముడు తెలిపారు. గురువారం మండల పరిధిలోని యడవలి గ్రామ పంచాయతీ గ్రామసభలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్లు సైడ్ కాలవలు సరిగ్గా లేక రోడ్డుమీద నీరు పారి మురుగు కాలువగా మారిందని పేర్కొన్నారు. ఈ మురుగు కాలువ ద్వారా దోమలు ఎక్కువై మలేరియా, డెంగీ లాంటి విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. సంబంధిత అధికారులు పరిశీలించి కొత్త సిసి రోడ్లకు సైడ్ కాలువలు వేసి గ్రామ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐ రవికుమార్, టిఎ సుధాకర్, విఆర్ఒ ఉన్నూరప్ప, సంజీవ రాయుడు, లాలు సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాల ఏర్పాటులో ప్రజాప్రతినిధులు విఫలం

- ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల హామీ కేవలం ఎన్నికల హామీగానే మిగిలిపోతుందని ఎఐఎస్ఎఫ్,ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు రంగస్వామి, శ్రీరాములు గౌడులు విమర్శించారు. శనివారం ఎఐటియుసి కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ అఖిల భారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శులు రంగస్వామి, శ్రీరాములు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గం పరిధిలో ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలు చెబుతున్నా, జిల్లాలోని కోడుమూరు నియోజకవర్గానికి మాత్రం అ నిబంధన వర్తించడం లేదన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రం ఎమ్మెల్యే అభ్యర్థులు అందరు మేము గెలిచిన వెంటనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పి నియోజకవర్గ ప్రజలకు, విద్యార్థులకు, మేధావులకు చెప్పి వారితో ఓట్లు వేయించుకొని గెలిచినా తర్వాత అ హామీని మరచిపోతున్నారని, నియోజకవర్గం పేరుకేమో ఢిల్లీ స్థాయికి సైతం నాయకులను అందించిన పేరుంది. విద్యాసంస్థలు ఏర్పాటులో మాత్రం అన్ని నియోజకవర్గాల కంటే వెనుకంజలో ఉందని, అనేకమంది రాజకీయ నాయకులు ఉన్నాకూడా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు మాత్రం ఎవరు పట్టించుకోరని, వారికీ ఆదాయం వచ్చే పనులను మాత్రం వెంటపడి మంజూరు చేసుకుంటారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఎన్నికైన టిడిపి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అయినా విద్యారంగా అభివృద్ధికి పూనుకొని డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులకు కనువిప్పు కలిగే విధంగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చూడతామని హెచ్చరిస్తున్నాం. ఎఐఎస్ఎఫ్ మండల నాయకులు వీరంజనేయులు, అల్తాఫ్, మహమ్మద్ అజామ్, పులి, ఎఐవైఎఫ్ నాయకులు విశ్వనాథ్, రాముడు పాల్గొన్నారు.



పత్తికొండ డిఎస్‌పిగా వెంకటరామయ్య బాధ్యతలు

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ డిఎస్పి కార్యాలయంలో పత్తికొండ సబ్ డివిజన్ డిఎస్పి వెంకటరామయ్య శనివారం ఉద్యోగబాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. డిఎస్పి వెంకటరామయ్యను పత్తికొండ అర్బన్ సిఐ జయన్న మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరపాలక ఉద్యోగులకు మెరుగైన సేవలు అందించాలని కార్యాలయ మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఎస్‌బిఐ బ్యాంకు నగరపాలక బ్రాంచ్ అధికారులకు సూచించారు. శనివారం నగరపాలక కార్యాలయంలో ఎస్‌బిఐ నగరపాలక బ్రాంచ్ మేనేజర్ డి.రాజేంద్రరావు, నగరపాలక కార్యాలయ మేనేజర్‌ను కలిశారు. ఈ సందర్భంగా నగర ఉద్యోగులకు రుణాలు, సేవలు, ప్రయోజనాలపై కాసేపు చర్చించారు.

హాస్టల్లో ఆకస్మిక పరిశీలన

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

ఓర్వకల్లు మండలంలోని మీది వేముల గ్రామంలో సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ప్రత్యేక అధికారి , జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ అమర్నాథ్ రెడ్డి శనివారం ఆకస్మిక పరిశీలన చేశారు. హాస్టళ్లలోని గదులను, వంటగదిని, స్టోర్ రూం, బాత్రూంలను తనిఖీ చేశారు. హాస్టల్‌లో నీరు వృథా కాకుండా కుళాయిలు ఏర్పాటు చేయలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చేసి పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ యాదవ్, హాస్టల్ వార్డెన్ రాఘవేంద్ర, ఉపాధి హామీ ఎపిఒ పి. కుమార్ సాయినాథ్, ఇసి టి. వెంకట భూపాల్ , పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ ఐడి ఉండాలి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

డిగ్రీ , పీజీ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఐడీని ఎబి సి ఆర్డర్ కింద ఐడీలు ఉండాలని వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్ పేర్కొన్నారు. శనివారం వర్సిటీలోని సెనేట్ హాల్లో డిగ్రీ , పీజీ కళాశాల ప్రిన్సిపల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ వన్‌నేషన్ వన్ స్టూడెంట్‌లో భాగంగా విద్యార్థులందరి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని పేర్కొన్నారు. కళాశాలలో ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణలోకి తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఏ కళాశాలలో నమోదు చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు సిడిసి డీన్ సివి కృష్ణారెడ్డి పరీక్షల విభాగం డీన్ సుందరానందపుచ్చా తదితరులు పాల్గొన్నారు.



నారాయణలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్థానిక మాధవనగర్‌లోని నారాయణ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి ముందస్తు వేడుకలు శనివారం నిర్వహించారు.సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన పోటీలలో చిన్నారులు ఉట్టి కొట్టడానికి పోటి పడ్డారు. చిన్నారులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆల్తాఫ్ అహ్మద్ వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరీ, రాధ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పరీక్షా ఫలితాలు విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ విద్యార్థుల రీ-వాల్యులేషన్ ఫలితాలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేసారు. శనివారం నాడు వర్సిటీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిజి కౌన్సిలింగ్ ప్రారంభమైనప్పటికీ ఇంకా డిగ్రీ ఫలితాలు విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. దీనిద్వారా పీజీ, ఇతర ఉన్నత విద్యకు వెళ్ళడానికి తీవ్రంగా ఇబ్బంది కలిగుతుందన్నారు. డిగ్రీ విద్యార్థులకు ప్రొవిజన్, కాన్వకేషన్ పత్రాలను వెంటనే విద్యార్థులకు అందించి పీజీ , ఇతర ఉన్నత విద్యలకు ఇబ్బంది లేకుండా చూడాలని యూనివర్సిటీ అధికారులను ఆయన డిమాండ్ చేశారు. యూనివర్సిటీ నాయకులు మౌలాలి, సందీప్, నాయక్, గణేష్, అమర్, దేవేంద్ర, ప్రకాష్, పవన్, గౌస్, నాగరాజు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో ఎమ్మెల్యే, విసి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

నగరం శివారులలోని రాయలసీమ యూనివర్సిటీలో శనివారం మొక్కల పెంపకం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఆవరణంలో మొక్కలను వారు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ పి.వెంకటేశ్వర్లు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

